# ఇసుక లోడింగ్‌లో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

## అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు




కరీంనగర్,జనతా న్యూస్ : ఇసుక లోడింగ్, రవాణా ప్రక్రియలో ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, ఎక్కడైనా తేడాలు లేదా అక్రమాలు జరిగితే సహించేది లేదని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం స్పష్టం చేశారు. అక్రమాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. సోమవారం రాత్రి వీణవంక మండలం చల్లూరులోని తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (టీజీఎండిసి) ఇసుక క్వారీని కలెక్టర్, సీపీ సంయుక్తంగా తనిఖీ చేశారు. క్వారీ వద్ద ఉన్న వేయింగ్ బ్రిడ్జి పనితీరును పరిశీలించి, ఇసుక లోడింగ్ సమయంలో లారీల బరువును స్వయంగా తనిఖీ చేశారు. వే బిల్లులు, డీడీలు, ఇతర రికార్డులను పరిశీలించి సిబ్బందినుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఇసుక లారీ లోడింగ్‌కు ముందు, లోడింగ్ అనంతరం తప్పనిసరిగా వేయిట్ చేయాలని సూచించారు. ప్రతి లారీ ఎంట్రీ, ఎగ్జిట్ వివరాలను సాండ్ ఆడిట్ యాప్‌లో కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. రికార్డుల్లో ఏ చిన్న తేడా ఉన్నా ఉపేక్షించేది లేదన్నారు. ఇసుక రవాణా సమయంలో లారీలపై తప్పనిసరిగా టార్పాలిన్ కవర్లు కప్పి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో రోడ్డుపై ఇసుక పడకుండా, ఇతర వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉంటుందని తెలిపారు. కస్టమర్లు డీడీ చెల్లించిన మేరకే ఇసుక లోడింగ్ చేయాలని, ఎక్కడైనా తేడాలు గుర్తిస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. క్వారీ సిబ్బంది, లారీ డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. లోడింగ్, వేయిటింగ్ ప్రక్రియ మొత్తం సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యేలా ప్రతి చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. లారీ వివరాల నమోదు చేసే గదిలో అవసరమైన కంప్యూటర్లు, సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని, ప్రతిదీ రికార్డు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అంతకుముందు వీణవంక మండలం మామిడాలపల్లి, మానకొండూరు మండలం పచ్చునూరు గ్రామాల్లోని ఇసుక చెక్‌పోస్టులను కలెక్టర్, సీపీ పరిశీలించారు. అక్కడ ఉన్న రికార్డులు, వే బిల్లులు, డీడీలను తనిఖీ చేసి, అక్రమ ఇసుక రవాణా, అక్రమ నిల్వలను పూర్తిగా అరికట్టాలని అధికారులకు ఆదేశించారు. ఈ విషయంలో జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తుందని తెలిపారు. ఈ తనిఖీల్లో ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్, హుజూరాబాద్ ఏసీపీ మాధవి, వీణవంక, మానకొండూరు తహసీల్దార్లు అనుపమ, విజయ్, టీజీఎండిసి ప్రాజెక్ట్ ఆఫీసర్ వినయ్ కుమార్‌తో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# ఆపరేషన్ స్మైల్‌ను విజయవంతం చేయాలి

## బాల కార్మికుల నిర్మూలనకు సమిష్టిగా కృషి చేయాలి




కరీంనగర్, జనతా న్యూస్ : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనతో పాటు తప్పిపోయిన, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న పిల్లలను గుర్తించి రక్షించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. బాల కార్మికుల నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో విజయవంతం చేయాలని సూచించారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంపై సంబంధిత శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని జనవరి 1 నుంచి జనవరి 31 వరకు పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. పరిశ్రమలు, హోటళ్లు, వ్యాపార సముదాయాలు, గోదాములు, ఇటుక బట్టీలు, మెకానిక్ షాపులు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలతో విస్తృత తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులు లేదా సహాయం అవసరమైన పిల్లలు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా 1098కు సమాచారం ఇవ్వాలని సూచించారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బడీడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కుటుంబాలకు దూరంగా ఉన్న పిల్లలను గుర్తించి తల్లిదండ్రుల వద్దకు చేర్చేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బాల కార్మికుల నిర్మూలనకు ప్రత్యేకంగా కృషి చేసి కరీంనగర్ జిల్లాను బాల కార్మికులు లేని జిల్లాగా తీర్చిదిద్దాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరు బాధ్యతతో సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ధనలక్ష్మి, ఇంచార్జి జిల్లా సంక్షేమ అధికారి సుగుణ, టాస్క్ ఫోర్స్ ఏసీపీ సతీష్, డీసీపీవో పర్వీన్, చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్, లేబర్ కమిషనర్, బీసీ వెల్ఫేర్ అధికారి అనిల్, క్వాలిటీ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, సీడీపీవోలు, పోలీస్, లేబర్, బాలల రక్షణ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొండగట్టు గిరిప్రదక్షణపై పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి

## మేడిపల్లి సత్యానికి ఫోన్ నివేదిక కోరిన ఏపీ డిప్యూటీ సీఎం



కరీంనగర్, జనతా న్యూస్ : చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యంకు ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఫోన్ చేశారు. ఇటీవల కొండగట్టులో పర్యటించి ఆంజనేయ స్వామిని దర్శించుకున్న పవన్ కళ్యాణ్, గిరిప్రదక్షణ అంశంపై వివరాల నివేదిక పంపాలని మేడిపల్లి సత్యాన్ని కోరారు. పవన్ కళ్యాణ్ కొండగట్టు పర్యటన సందర్భంగా టీటీడీ నిధులతో హనుమాన్ మాలవిరమణ మండపం, వాయుపుత్ర సదన్ వసతి గృహాలకు భూమి పూజ చేశారు. ఆ పర్యటనలో గిరిప్రదక్షణలో నిత్యం వేలాది మంది భక్తులు పాల్గొంటున్న విషయాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గిరిప్రదక్షణపై కూడా దృష్టి సారిస్తే భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించవచ్చని సూచించారు. దీనికి స్పందించిన పవన్ కళ్యాణ్, వేదికపైనే గిరిప్రదక్షణకు తప్పకుండా సహాయం చేస్తానని, అవసరమైతే కరసేవకు కూడా సిద్ధమని ప్రకటించారు. కొండగట్టు నుంచి పవన్ కళ్యాణ్ వెళ్లి 48 గంటలు గడవకముందే ఆయన మేడిపల్లి సత్యానికి ఫోన్ చేసి గిరిప్రదక్షణ అంశంపై వివరాలు పంపాలని కోరారు. అలాగే తన పర్యటనను విజయవంతం చేయడంలో సహకరించిన తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పవన్ కళ్యాణ్ ఫోన్ చేసిన వెంటనే ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సత్యప్రసాద్ జగిత్యాల జిల్లా కలెక్టర్‌కు సమాచారం ఇచ్చి గిరిప్రదక్షణ ప్రాంతంపై ఫీల్డ్ సర్వే నిర్వహించి నివేదిక సిద్ధం చేయాలని కోరారు. స్పందించిన కలెక్టర్ సత్యప్రసాద్, రెవెన్యూ, ఫారెస్ట్, ఎండోమెంట్ శాఖల అధికారులతో కలిసి కొండగట్టు గిరిప్రదక్షణ ప్రాంతాన్ని పరిశీలించారు. గిరిప్రదక్షణ రహదారి అభివృద్ధి, పార్కింగ్ సదుపాయాలు, తాగునీరు, వాష్‌రూమ్‌ల ఏర్పాటు వంటి అంశాలతో పాటు భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణం కల్పించేలా హనుమాన్ భక్తి గీతాలతో మ్యూజిక్ సిస్టం ఏర్పాటు ప్రతిపాదనలతో పూర్తి స్థాయి నివేదికను సిద్ధం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నివేదికను త్వరలోనే ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ద్వారా పవన్ కళ్యాణ్‌కు అందజేయనున్నట్లు చెప్పారు. కొండగట్టు గిరిప్రదక్షణపై పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించడంపై ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే నివేదికను అందజేస్తామని పేర్కొన్నారు.

# ‘ప్రజావాణి’ దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి



## కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాలు

కరీంనగర్, జనతా న్యూస్ : ప్రజావాణి ద్వారా అందుతున్న దరఖాస్తులకు ప్రాధాన్యం ఇచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వర పరిష్కారం చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్‌బాబులతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వచ్చిన కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 299 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో అత్యధికంగా కరీంనగర్ నగరపాలక సంస్థకు సంబంధించినవి 68, హౌసింగ్ శాఖకు సంబంధించినవి 43 దరఖాస్తులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మాధవ సేవా సమితి ఆధ్వర్యంలో స్వర్ణామృత ప్రాసన చుక్కల మందు పంపిణీ

## 164 మంది పిల్లలు పాల్గొన్న కార్యక్రమం




కరీంనగర్, జనతా న్యూస్ : మాధవ సేవా సమితి కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మాధవ నిలయంలో స్వర్ణామృత ప్రాసన చుక్కల మందు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 164 మంది పిల్లలు స్వర్ణామృత ప్రాసన చుక్కల మందును వినియోగించుకున్నారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రాంత కార్యవాహ కాచం రమేష్, మాధవ సేవా సమితి అధ్యక్షులు సీఏ నిరంజనా చారి, మానవీయ జిల్లా సహ సంఘచాలక్ ఎలగందుల సత్యనారాయణ, విభాగ్ సహ కార్యవాహ మురలీ జీ, సమితి కార్యదర్శి కామరపు ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, పిల్లల ఆరోగ్యం, రోగనిరోధక శక్తి పెంపొందించడమే లక్ష్యంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆరోగ్య సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.

# ఓటర్ల జాబితా సరిచేసి దొంగ ఓట్లను తొలగించాలి

## డివిజన్ పరిధిలోనే పోలింగ్ బూత్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి



కరీంనగర్, జనతా న్యూస్: నూతనంగా ఏర్పాటు చేసిన 66 డివిజన్ల పరిధిలో ఓటర్ల జాబితాను సరిచేసి, దొంగ ఓట్లను తొలగించడంతో పాటు ప్రతి డివిజన్‌కు సంబంధించిన పోలింగ్ బూత్ కేంద్రాలు ఆయా డివిజన్ పరిధిలోనే ఏర్పాటు చేయాలని కోరుతూ కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో డీసీసీ ఉపాధ్యక్షులు మడుపు మోహన్, కాంగ్రెస్ నాయకులు వీర దేవేందర్, మొహమ్మద్ అమీర్, శేఖర్, ఇమ్రాన్ ఆసిఫ్, పలువురు మాజీ కార్పొరేటర్లతో కలిసి కమిషనర్‌ను కలిసి ఈ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, 66 డివిజన్లుగా పునర్విభజన జరిగిన నేపథ్యంలో ఒక డివిజన్ నుంచి మరో డివిజన్‌కు మారిన ఓటర్ల వివరాలను సరిచేయాలని, కొన్ని డివిజన్లలో ఉన్న దొంగ ఓట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే 18 సంవత్సరాలు నిండిన నూతన ఓటర్లకు ఓటు హక్కు కల్పించాలని, ఒక డివిజన్‌కు చెందిన ఓటర్లు మరో డివిజన్‌లో ఉండకుండా ఒకే డివిజన్ పరిధిలోకి తీసుకురావాలని కోరారు.

పోలింగ్ సమయంలో ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా, ప్రతి డివిజన్‌కు సంబంధించిన పోలింగ్ బూత్ స్టేషన్లు ఆయా డివిజన్ పరిధిలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియ పారదర్శకంగా సాగాలంటే ఓటర్ల జాబితా ఖచ్చితంగా ఉండటం అత్యంత అవసరమని కాంగ్రెస్ నాయకులు అభిప్రాయపడ్డారు.

